# మల్లెతీగ



బచ్చు వీర్రాజు

ఉదయం ఆరుగంటలయింది. అప్పుడే సరిగ్గా పేపర్ కుర్రాడు సైకిల్ దిగి, నా చేతికందించిన పేపర్ అందుకొని, ఈజీ ఛైర్లో కూలబడ్డాను.

నెమ్మదిగా ఏదో ఆలోచిస్తూ పేపర్ తిరగేస్తున్నాను యింతలో శ్రీమతి కాఫీ కప్పుతో ప్రత్యక్షమై నా చేతికి కప్పు అందించి అలాగే నిలబడింది.

కప్పు అందుకొని శ్రీమతి వంక ప్రశ్నార్థకంగా చూశాను

నెమ్మదిగా శ్రీమతి పెదవులు విప్పింది.

"చూడండి ! మీరు ఏమీ అనుకోనంటే..." శ్రీమతి ఆగింది.

"ఊఁ! అనుకోనులే విన్నవించు" అన్నాను నవ్వుతూ.

"అదే! దొడ్లో ... మ ... ల్లె ... తీగ మరోసారి వేసి...చూద్దాం..." తడబడుతూ అంది శ్రీమతి

"అబ్బబ్బ! యిప్పటికి నాలుగుసార్లు మల్లెతీగను తెచ్చి పాతిపెట్టాం. బ్రతికి ఏడిచిందా? నీ పిచ్చిగాని" విసుక్కున్నాను ముఖం చిట్లించుకొని.

"నిజమే! అది వేసిన జాగాలో మట్టి మంచిది కాదేమోనని కొత్త మట్టి తెప్పించి వేశాం, అదేమి విడ్డూరమో ఒక్క అంటు కూడా బ్రతకలేదు" అంది శ్రీమతి నిట్టూరుస్తూ.

"మన దొడ్లో మల్లెతీగకు ఆనవాయితీ లేదేమో?" చిరాగ్గా అన్నాను.

"దీనికి ఆనవాయితీ ఏమిటండీ? నా మాట విని ఈ సారి బాగా వేళ్ళు తొడిగిన మల్లెతీగను తెమ్మని మన ఫ్యూన్ రంగయ్యకు పురమాయించండీ!"

"ఊఁ! సరేలే యింక సరిగమ నొక్కులు ఆపుచెయ్యి చూద్దాం!"

"అదీ! శ్రీవారంటే అలా వుండాలి. చూస్తాను ఈసారి ఎందుకు బ్రతకదో" అంటూ లోపలికి దారి తీసింది శ్రీమతి.

నేను నవ్వుకుంటూ పేపర్లోకి తల దూర్చాను.

* * *

"జనరల్ మేనేజర్" అని వున్న నా రూమ్‌లోకి ప్రవేశించి "రివాల్వింగ్ ఛైర్"లో కూర్చున్నాను

ఫైల్స్ తిరగవేస్తూ వుండగా, శ్రీమతి కోరిన కోరిక గుర్తుకు వచ్చింది.

ఓ సారి శ్రీమతి గురించి ఆలోచించాను. శ్రీమతికి మల్లెపూలంటే తగని యిష్టం. మేము కొత్తగా కట్టుకొన్న రెండస్థుల మేడ వెనుక ఖాళీ ప్రదేశంలో రకరకాల పూల మొక్కలు మేడ కట్టడం పూర్తికాకుండానే మా రంగయ్య శ్రద్ధగావేసి పెంచాడు. అయితే అందులో మల్లెతీగ లేదు దానితో శ్రీమతి గొడవ మొదలైంది. గృహప్రవేశం కాగానే శ్రీమతి మల్లెతీగను తెచ్చి పాతించింది. అయితే అది బ్రతకలేదు. ఎవరో చెబితే, కొత్త మట్టి తెప్పించి తిరిగి రెండోసారి మరో మల్లెతీగను పాతించింది. అదీ అంతే! ఇలా వరుసగా నాలుగుసార్లు జరిగింది.

శ్రీమతి కోరిక అలాగే వుండపోయింది. నాలుగు ప్రయత్నాలూ నీరుకారి పోయాయి. తిరిగి ఐదో ప్రయత్నం చేస్తున్న శ్రీమతిని చూసి జాలేసింది.

ఇంతలో రంగయ్య స్ప్రింగ్‌డోర్ తెరచుకొని లోపలికొచ్చి నిలబడటంతో, నా ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టాను

రంగయ్యకు ఫైల్సు అందిస్తూ ఓసారి అతని ముఖంవంక చూశాను.

రంగయ్య తడబడుతూ, అలాగే నిలబడి పోయాడు

"చూడు రంగయ్యా! అమ్మగారి గొడవ ఎక్కువైపోయింది ఈసారి 'మలె తీగ' బాగా వ్రేళ్ళు తొడిగిన అంటుని చూసి తీసుకురా. మొన్న వేసినది చచ్చిపోయింది" అంటూ లేచి నిలబడ్డాను

"చిత్తం! రేపే వెళ్ళి తీసుకొస్తానండి బాబయా!" అంటూ ముందుకు నడిచాడు.

నేను డ్రైవ్ చూసుకొని, బయట నా "మోరిస్ మైనర్" వైపుకు దారి తీశాను.

* * *

ఆ మరునాడు మా ఫ్యూన్ రంగయ్య అన్నట్టుగానే ఓ మంచి 'మల్లెతీగ' బాగా వ్రేళు తొడిగిన దానిని తీసుకొచ్చాడు

దానికి చూడగానే శ్రీమతి ముఖం చాటంతైంది.

వెంటనే ఆ తీగ నందుకొని "చూడు రంగయ్యా! రేపు నువ్వొపాటికి నాలుగు రాటలు కూడా తీసుకురావాలి దీనికి ఆలస్యంలేకుండా పందిరి కూడా వేసేద్దాం!" అంటూ పురమాయించింది శ్రీమతి.

నేను శ్రీమతి ఆతృతకు నాలో నేనే నవ్వుకొన్నాను.

* * *

పనిమనిషి గౌరమ్మ సాయంతో, ఆ తీగను స్వయంగా శ్రీమతి అందుకొని, గొయ్యితీసి పాతిపెట్టడం నా కళ్ళబడింది. దానిని పాతే ముందు, శ్రీమతి ఓ కొబ్బరికాయను కొట్టి మరీ పాతడం నాకు నవ్వు తెప్పించింది

రంగయ్య తెచ్చిన రాటలతో, ఆ మరునాడు దానికి పందిరి వెయ్యడం కూడా పూర్తి అయింది.

శ్రీమతి ముఖంలో నూతనోత్సాహం పెల్లుబక పొగడం చూస్తుంటే, నా మనసు కూడా గాలిలో కేరింతలు కొట్టడం మొదలు పెట్టింది.

టైమ్ పది గంటలు కావస్తోంది. ఆఫీస్‌కి బయలుదేరుతుండగా "టెలిగ్రామ్ సార్!" అన్న కేక వినబడితే, గేట్ వైపుకు నడిచాను.

"మదర్ సీరియస్. స్టార్ట్" అది మా భావమరది రామం యిచ్చిన టెలిగ్రామ్.

సంగతి తెలుసుకొన్న శ్రీమతి ఒక్కసారి ఘొల్లుమంది.

ఓ ప్రక్క నేనూ, మరో ప్రక్క గౌరమ్మా శ్రీమతిని ఊరడించి, ప్రయాణానికి బయలు దేరతీశాం.

నేను కారు ఫ్రంట్ డోర్ తెరుస్తూ, గౌరమ్మని పిల్చి "యిల్లు జాగ్రత్త" అంటూ తాళాలందించి, శ్రీమతి ఎక్కగానే కారు స్టార్ట్ చేసి ముందుకు పరుగు తీయించాను.

* * *

అక్కడ మా మావగారింట్లో పరిస్థితి మామూలుగా మారడంతో మా అందరి మనసులూ కుదుట బడ్డాయి.

మా అత్తగారు తిరిగి కోలుకోవడం, గండం గడిచి బయట పడటం మా అందరికీ ఆనందాన్ని కలుగజేసింది.

నాలుగు రోజులు గడిచాయి.

# మల్లెతీగ

నేనూ, శ్రీమతీ అందరి దగ్గరా శెలవు తీసుకొని యింటికి బయలుదేరాం.

* * *

ఇంటికి చేరగానే, శ్రీమతి పరుగుపరుగున దొడ్లోకి వెళ్లి ఒక్కసారి కెవ్వుమని అరిచింది.

నేను గబగబా అటువైపుకు పరుగెత్తాను. శ్రీమతి గుడ్లనీళ్లు గ్రక్కుకొంటూ, ఓ చేత్తో మరో ప్రక్క చూపించసాగింది.

అక్కడ దృశ్యం చూసేసరికి నాకు మతి పోయింది.

శ్రీమతి స్వయంగా పాతిన మల్లెతీగ వాడిపోయివుంటే, దానిచుట్టూ పందిరికోసం పాతిన రాటలు చక్కగా చిగిర్చి ఆకులుతొడిగి వున్నాయి.

నాకు నోట మాట రావటం మానేసింది. నెమ్మదిగా శ్రీమతి భుజం తట్టి లోపలకు నడిపించుకొని వెళ్లాను.

* * *

"క్రొత్తమట్టి వేసినచోట, బాగా వ్రేళ్లు తొడిగిన మల్లెతీగ, శ్రద్ధగా గౌరమ్మ రోజూ నీళ్లు పోస్తున్నప్పుడు ఏందుకా విధంగా తల వాల్చేసిందో?" వింత నేను తల బద్దలు కొట్టుకొన్నా అర్థం కాలేదు

పై అంతస్థులోని హాలులో, నిలబడి ఏదో ఆలోచిస్తున్నాను.

ఇంతలో ఓ దృశ్యం నా కంట బడింది. వెంటనే నాలుగడుగులు ముందుకు వేసి నిలబడి, దొడ్లోకి పరీక్షగా చూడసాగాను.

అక్కడ మల్లెతీగ దగ్గర గౌరమ్మకొడుకు రాజా చేస్తున్న పని ఏమిటో నా కంటబడ్డాక నా ఒళ్లు మండిపోసాగింది.

వెంటనే "రాజా" అని గట్టిగా అరిచాను. నా అరుపుకి వాడూ, వాడికి కాస్త దూరంలో వుండి దొడ్డి వూడుస్తున్న గౌరమ్మా అదిరి పడ్డారు.

"గౌరమ్మా! రాజుని పైకి పంపించు" అంటూ నేను కదం త్రొక్కసాగాను.

రాజా పైకి వచ్చాడు. నన్ను చూసి ఒణికి పోసాగాడు.

"అది కాదండి! అమ్మగారి కిష్టమైన మల్లెతీగ క్రొత్తవేళ్లు తొడిగి బ్రతికిందో లేదోనని దానిని పైకిలాగి, చూస్తున్నానండి" అడక్కుండానే సంజాయిషీ యిచ్చాడు రాజా బెదిరిపోతూ.

సంగతి అర్థమైంది. "ప్రతిసారీ వీడి వల్లనే మల్లెతీగ గంగపాలవుతోందని" ఊహించాను.

"మరోసారి దొడ్లోవున్న ఏ మొక్క మీదైనా చెయ్యి వేశావో డొక్క చీరుస్తాను చూసుకో! మొక్క బ్రతికిందీ, లేనిదీ తెలుసు కోవాలంటే దాన్ని పీకి చూస్తాడ్రటా ఏ వెధవైనా? ఫో!" అంటూ వాడిమీద కసురుకొన్నాను.

* * *

సంగతి తెల్సుకొన్న గౌరమ్మ కూడా వాడి మీద మండి పడింది. శ్రీమతి ఆ రాజాగాడు చేస్తున్నపని బోధపడగానే ఏడవాలో, నవ్వాలో అర్థం కాలేదు.

ఇది జరిగిన మరో రెండు రోజుల కే మరో కొత్త మల్లెతీగ వచ్చి మా దొడ్లో వెలిసింది.

అయితే యీసారి ఆ మల్లెతీగ చక్కగా బ్రతికి,పందిరి అంతా అల్లుకొని, కొన్నాళ్లకు మొగ్గ తొడగడం మొదలు పెట్టింది.

శ్రీమతి ఆనందానికి పట్ట పగ్గాలు లేకుండా పోయింది. ★



Sobhagya-82